క్లుప్తంగా

వరుణ దేవా కరుణించవా..



శాయంపేట : వరుణ దేవా కరుణించవా.. అంటూ మండలంలోని పత్తిపాక గ్రామంలో రెడ్డి సంఘం మహిళలు, రైతులు గ్రామ దేవతలకు ఆదివారం నీటితో అభిషేకం చేశారు. సంఘం ఆధ్వర్యంలో మహిళలు తొలుత గ్రామ దేవతలకు పూజలు చేశారు. అనంతరం బిందెలతో నీళ్లు తీసుకొచ్చి అభిషేకం చేశారు. వర్షాకాలం మొదలై నెల గడుస్తున్నా వర్షం కురవకపోవడంతో విత్తనాలు మొలవక పత్తి గింజలు ఎండిపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండి రైతులు సుభిక్షంగా ఉండాలని గ్రామదేవతలను కోరుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మసీదు కలీల్ కమిటీ ఎన్నిక



షేక్ హుస్సేన్

కమలాపూర్ : మండలంలోని కాసీంపల్లిలో మసీదు కలీల్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ చిన్న హుస్సేన్, కార్యదర్శిగా సయ్యద్ గోరే మియా, సంయుక్త కార్యదర్శిగా షేక్ వలీ, కోశాధికారిగా షేక్ చిన్న వలీ ఎన్నికయ్యారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఐనవోలు : నేడు (సోమవారం) జిల్లా కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు కేటాయించాలని, అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని, గొర్రెల పంపిణీకి బదులు నగదు బదిలీ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా తలపెట్టినట్లు పేర్కొన్నారు. ధర్నాకు నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నోట్ బుక్స్ పంపిణీ

విద్యారణ్యపురి: హనుమకొండలోని టీచర్స్ కాలనీ ఫేజ్ -1లోని కమ్యూనిటీ హాల్‌లో పేద విద్యార్థులకు ఎన్ఆర్ఐలు డోలి సరిత, కైరంకొండ గిరి అందజేసిన రూ.లక్ష విలువ గల నోట్ పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని ప్రశంసించారు. టీచర్స్‌కాలనీ ప్రగతిమిత్ర కాలనీ అధ్యక్షుడు రాంరెడ్డి, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, ప్రగతిమిత్ర బాధ్యులు డోలి రాజలింగం, బేరి సత్యనారాయణ, డాక్టర్ ఇమ్మడి పుల్లయ్య, మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఖిలా వరంగల్: వరంగల్ నగరానికి చెందిన ఆల్ టూవీలర్ సీనియర్ మెకానిక్ కడారి శ్రీనివాస్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులో బాధిత కుటుంబ సభ్యులను ఖమ్మం జిల్లా ఆల్ టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగాల కొండల్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి బాబు, ఉపాధ్యక్షుడు ఎండీ.జాఫర్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ప్రచార కార్యదర్శి బుల్లెట్ అన్వర్, తల్లాడ అధ్యక్షుడు కోడూరు నరసరావు, ఉపాధ్యక్షుడు పెనుకొండ నాగరాజు, రామన్న, శ్రీను, కిషన్, బషీర్ తదితరులు ఉన్నారు.

చేయూత

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ రిటైర్డ్ ఆర్ఎస్సై జానీమియా(71) అనారోగ్య సమస్యలతో ఆదివారం మృతి చెందాడు. జానీమియా మృతదేహాన్ని రిటైర్డ్ పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రంగరాజు ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య గౌసియాబేగం, కుమారులను పరామర్శించి దహన సంస్కారాల నిమిత్తం రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో గంగపురం మధుసూదన్‌గౌడ్, ఎంఏ.ఖాదర్, ఎస్‌డీ.ఖాజా, ఎస్‌డీ.పాషా, ఎండీ.సర్వర్, ఎండీ.జాఫర్ పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాల పంపిణీ

మామునూరు: గురుపౌర్ణమిని పురస్కరించుకుని జ్ఞాన ధర్మప్రచార కార్యక్రమంలో భాగంగా ఖిలా వరంగల్ మండలం మామునూరులో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఎల్కతుర్తి కమిటీ అధ్యక్షుడు సదా నిరంజన్ సిద్ధాంతి ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా భగవద్గీత గ్రంథాలను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకట్, రేవతి, రాధ, కీర్తన్‌సింగ్, సాకేత్‌సింగ్, రాణి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ అస్తవ్యస్తం

- పాఠశాలకు ఎదుటే మంటలు, పొగ
- ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- పరిసరాలు అపరిశుభ్రం



పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



పాఠశాల ఎదుటే దగ్ధమౌతున్న మొక్కజొన్న బెండ్లు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల స్కూల్, కళాశాల (కేజీబీవీ) అస్తవ్యస్తంగా తయారైంది. ప్రమాదాలకు నిలయంగా మారింది. పాఠశాల, కళాశాల పరిసరాలు చెత్తాచెదారంతో అపరిశుభ్రతకు నిలయంగా ఉంది. వేసవిలో రైతులు కంకులు ఆరబోసుకొని పట్టిన తర్వాత బెండ్లను అక్కడే వదిలేయడంతో గుర్తు తెలియని వ్యక్తులు వాటిని ఆదివారం తగులబెట్టారు. దీంతో కేజీబీవీకి వెళ్లే దారిలో పెద్దఎత్తున మంటలు, దట్టమైన పొగలు వెలువడ్డాయి. పక్కనే ఉన్న చెట్టు మొదలు సైతం దగ్ధమైంది. ఇదంతా పాఠశాల సిబ్బంది చూసినా మంటలను ఆర్పని దుస్థితి నెలకొంది.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌పార్మర్

పాఠశాల ప్రాంగణంలోని విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ ప్రమాదకరంగా ఉంది. విద్యుత్ తీగలు మూడు ఫీట్ల ఎత్తులోనే ఉండడం గమనార్హం. విద్యార్థినులు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం లేకపోలేదు. అయినా పట్టించుకున్న దాఖలాల్లేవు.



ప్రహరీ పక్కనే చెత్తాచెదారం

ప్రహరీ పక్కనే చెత్తాచెదారం

రోజువారి చెత్తను పాఠశాల ప్రహరీ పక్కనే వేసి కొద్ది రోజుల తర్వాత మొత్తం ఒకేసారి దహనం చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో పర్యావరణం కలుషితమై కేజీబీవీ విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంది.

అంతగా మంటలు, పొగ లేదు

పాఠశాల పక్కన రైతు బెండ్లను తగలబెట్టాడు. అంతగా మంటలు, పొగ లేదు. సమస్యలేమైనా ఉంటే పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటాం.

-మాధవి, స్పెషల్ ఆఫీసర్

అధికారులు చొరవ తీసుకోవాలి

అధికారులు ఇప్పటికైనా ప్రత్యేక చొరవ తీసుకుని కేజీబీవీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలని, పరిసరాలను శుభ్రం చేయించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, మండల ప్రజలు కోరుతున్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

దామెర : సమాజంలోని ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని యేసుదేవ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకురాలు జాన్సన్ ప్రీతి ఆకాంక్షించారు. మండలంలోని పులుకుర్తి గ్రామంలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో వృద్ధులకు ఆ సొసైటీ ఆధ్వర్యంలోని ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేవునిపై భక్తితోపాటు ఇతరుల పట్ల సేవాగుణం కలిగి ఉండాలని సూచించారు. పేదలకు, వృద్ధులకు, కష్టాల్లో ఉన్న ప్రతిఒక్కరికీ తోడ్పాటు అందించాలని తెలిపారు. సొసైటీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ జాన్సన్, చర్చి అధ్యక్షుడు గోవిందు రమేష్, సంఘ పెద్దలు రాకేశ్, సుగుణాకర్, ఆనంద్, కరుణాకర్, జిల్లెల్ల మురళీ, కారోబర్ గోవిందు ఆనంద్ పాల్గొన్నారు.



వృద్ధులకు సరుకులు పంపిణీ చేస్తున్న జాన్సన్ ప్రీతి

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

ధర్మసాగర్ : ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు జీఓ నంబర్ 58 ద్వారా పట్టాలివ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈనెల 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆ పార్టీ మండల కార్యదర్శి బట్టు మల్లయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం ఎల్లేశ్ ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఏర్పడినా పేదలకు స్థలం ఇచ్చి ఇల్లు కట్టించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇల్లు లేని పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కట్టిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా ఆ దిశగా చేసిందేమీ లేదన్నారు. పేదలు అద్దె చెల్లించలేక ఆర్థాకలితో పస్తులుంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదలకు స్థలాలిచ్చి ఇళ్లు కట్టించాలని కోరారు. ఈనెల 6న తలపెట్టిన ధర్నాకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, పేదలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్, రాజయ్య, లచ్చయ్య, వెంకటయ్య, రాజమణి, లక్ష్మి, స్వరూప, రాణి, సుభద్ర, జ్యోతి, రమేష్, రజిత, రమ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎల్లేశ్, నాయకులు

అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం



ఎల్కతుర్తి : కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు



ఆత్మకూరు : కార్యకర్తలతో మాట్లాడుతున్న ప్రభాకర్

ఎల్కతుర్తి : దేశాభివృద్ధే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి తెలిపారు. మండలంలోని గోపాల్‌పూర్, చింతలపల్లి, పెంచికలపేట గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన స్వల్పకాలిక విస్తారక్ బూత్ వెరిఫికేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం కేంద్రం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరిశీలకుడు శ్రీకాంత్‌జీ, నాయకులు కంచర్ల శంకరయ్య, ముష్కె వెంకటేశ్, పల్లెపాటి మధుకర్, చిదురాల కరుణాకర్, రవి, బాలకృష్ణ, అక్షయ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలి

ఆత్మకూరు : బీజేపీ కార్యకర్తలు బూత్‌స్థాయిలో అంకితభావంతో పని చేయాలని ఆ పార్టీ అల్పకాలిక విస్తారక్ డుక్కెరి ప్రభాకర్‌రావు కోరారు. మండలంలోని పెద్దాపూర్, లింగమడుగుపల్లె గ్రామాలను ఆదివారం ఆయన బూత్‌స్థాయిలో పరిశీలించి మాట్లాడారు. కార్యకర్తలు బూత్‌స్థాయిలో కార్యకర్తలు పార్టీని విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గట్టు వేణుగౌడ్, నాయకులు బత్తిని వీరస్వామి, వజ్ర రవికుమార్, కొడగాని నాగేశ్వర్‌రావు, లకిడె నాగరాజు, ఎర్రం అశోక్, కందికొండ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి స్థపతి పూజలు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామిని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ స్థపతి వల్లినాయగం ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం, స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆలయ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, ఉప ప్రధాన అర్చకులు వల్లినాయగంకు వివరించారు. దేవస్థాన యాగశాల, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో అర్చకులు రాంబాబు, సదానందం, వీరభద్రయ్య, శ్రీకాంత్, రమేష్, శివకుమార్, శరత్‌చంద్ర, సిబ్బంది రవిందర్, సందీప్, శ్రీధర్, రాజు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న వల్లినాయగం

రోడ్డు పనులు పూర్తి చేయాలి

కాజీపేట అర్బన్: రోడ్డు పనులు పూర్తి చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో న్యూశాయంపేటలో స్థానికులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల సారంగపాణి మాట్లాడారు. 31వ డివిజన్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రైల్వే ట్రాక్ వరకు రోడ్డు నిర్మాణానికి ఏడాది క్రితం చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నూరులో వ్యవసాయ విద్యుత్ పునరుద్ధరణ

కమలాపూర్ : మండలంలోని కన్నూరు గ్రామంలో ఎస్ఎస్-9 వద్ద ఉన్న 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అధికారులు ఆదివారం విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వ్యవసాయ విద్యుత్‌ను పునరుద్ధరించారు. కన్నూరు శివారులోని సమ్మక్క గద్దెల వద్దకు వెళ్లే దారిలో కొత్తగా నిర్మించిన బ్రిడ్జి వద్ద వ్యవసాయ అవసరాల కోసం వేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా తొలగించి మరోచోటకు మార్చకపోవడంతో తాము వరి నార్లు పోసుకోలేక పోతున్నామని రైతులు ఆందోళన చేపట్టగా విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటకు మార్చడానికి ఎస్టిమేట్‌తో కూడిన అంగీకార పత్రాన్ని సర్పంచ్ పుల్లూరి రాంచందర్ రావుకు అందజేశామని, రెండ్రోజుల్లో డబ్బులు చెల్లిస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారని విద్యుత్ శాఖ ఏడీ పైడయ్య, ఏఈ సంపత్‌రెడ్డి తెలిపారు. మండలంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయడానికి కార్యాచరణ చేపట్టామని వారు చెప్పారు. కన్నూరు, కానిపర్తి, శనిగరం గ్రామాల్లో వేలాడే విద్యుత్ తీగలను ఆదివారం సరి చేశామన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 10 వరకు కొనసాగుతుందని ఏడీ తెలిపారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

నగరంలో పలు అమ్మవారి దేవాలయాల్లో శాకంబరి ఉత్సవాలు

హన్మకొండ కల్చరల్: ఆషాఢ శుద్ధ పూర్ణిమనే వ్యాస పూర్ణిమ అంటారు. వేద సంహితలను రాసిన వ్యాస భగవానుడిని పూజిస్తారు. వ్యాస భగవానుడు వ్యక్తి కాదని, గురువు మాత్రమేనని భావించేవారు గురు పౌర్ణమిగా జరుపుకుంటారు. సాయిభక్తులు సాయి మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నదీ తీరాల్లో నివసించేవారు నదీస్నానాలు చేయడం శ్రేష్ఠంగా భావిస్తారు. హనుమకొండ బస్టాండ్ సమీపంలోని షిర్డీ సాయిబాబా మందిరం, కేయూసీ రోడ్డు యాదవనగర్‌లోని సాయిబాబా ఆలయం, పద్మాక్షినగర్‌లోని సాయిబాబా ఆలయం, భద్రకాళి దేవాలయం సమీపంలోని సాయిబాబా మందిరంలో సోమవారం గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఉత్సవాలు నిర్వహించనున్నారు.

దేవాలయాల్లో శాకంబరి ఉత్సవాలు

సోమవారం ఆషాఢ శుద్ధపూర్ణిమను పురస్కరించుకుని హనుమకొండలోని హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో, శ్రీజ్ఞాన సరస్వతిదేవి పీఠంలో ఉత్సవాలు జరుగుతాయని, జ్ఞానదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భద్రకాళి ఆర్చిగేట్ వద్ద రాత్రి 8గంటలకు అన్నప్రసాదాల వితరణ జరుగుతుందని పీఠం ఆచార్యులు పవన్‌కుమార్ తెలిపారు. వరంగల్‌లోని ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవాలయంలో సాయంత్రం పౌర్ణమి పూజ, అమ్మవారికి శాకంబరి అలంకరణ అనంతరం భోజన ప్రసాదాలు అందజేస్తామని ఆలయ చైర్మన్ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నిరూప్‌నగర్ తండా, రైల్వే గేట్, సుబ్బయ్యపల్లి ప్రాంతాల్లో మరమ్మతులు కొనసాగుతున్నందున విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

జాతి అభ్యున్నతికి పాటుపడాలి

హన్మకొండ: జాతి అభ్యున్నతికి, ముదిరాజ్ విద్యార్థుల ఉన్నతికి సభ్యులు పాటుపడాలని ముదిరాజ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ కోరారు. హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీలోని మెపా రాష్ట్ర కార్యాలయంలో హనుమకొండ జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్ ఆదివారం ప్రకటించారు. అధ్యక్షుడిగా భూమా భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా నిమ్మల దేవేందర్ ముదిరాజ్, కోశాధికారిగా పిట్టల రమేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా బొల్లి విజేందర్, అమ్మగామి శ్యామ్ సుందర్, సార సతీష్, సంయుక్త కార్యదర్శులుగా కేశబోయిన కోటేశ్వర్ రావు, ఇట్టబోయిన నాగరాజు, సుంచు ప్రశాంత్, బండి కోటేశ్వర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా తాళ్ల రవి, కార్యవర్గ సభ్యులుగా బండి సురేష్, కుక్కల శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా మట్టిపల్లి చంద్రశేఖర్, మండల సమ్మయ్యను నియమించినట్లు శ్రీనివాస్ వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు గుండాల మదన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కమలాపూర్ : నాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే (ఎంజేపీ) బాలుర గురుకుల పాఠశాలలో 2001-02 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 21 ఏళ్ల తర్వాత తాము చిన్ననాట చదువుకున్న పాఠశాలలో కలుసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య మాట్లాడారు. గురుకులంలో చదువుకున్న మొదటి బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి తాము చిన్ననాట చదువుకున్న పాఠశాలలో మళ్లీ కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. చక్కటి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి లక్ష్యాన్ని చేరుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆంగ్ల ఉపాధ్యాయురాలు రాజరాజేశ్వరి మాట్లాడుతూ 21 ఏళ్లు గడచినా నాటి తోటి విద్యార్థులను, విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులను గుర్తుంచుకోవడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పోరెడ్డి తిరుపతి, శ్రీనివాస్, రమేశ్, మల్లేశ్, అనిల్‌కుమార్, విజయ్‌కుమార్, తిరుపతి, రాజేందర్, మధుకర్, రాజు, నవీన్, వెంకటేశ్ పాల్గొన్నారు.



ధర్మసాగర్‌లో..

జోరుగా.. హుషారుగా..

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1986-87 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని జోరుగా.. హుషారుగా నిర్వహించారు. నాటి మిత్రులు ఒకరినొకరు పలకరించుకుంటూ గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంబరాలు చేసుకున్నారు. మహిళలు కోలాటం ఆడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా నాటి గురువులు రాధాకృష్ణ, మధుసూదన్‌రావు, జనార్దన్ రెడ్డి, మహేందర్‌రెడ్డి మాట్లాడారు. నాటి విద్యార్థులు ఒకచోట కలుసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జీవితంలో మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. నాటి ఉపాధ్యాయులు రాధాకృష్ణ, మధుసూదన్‌రావు, వల్లపురెడ్డి జనార్దన్ రెడ్డి, రేమిడి మహేందర్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాంధన్, ఉపాధ్యాయుడు రాజగోపాల్‌రెడ్డి, పూర్వ విద్యార్థుల కమిటీ కన్వీనర్ కొత్తకొండ రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా

ఎల్కతుర్తి : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్ విమర్శించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే పేదలకు స్థలాలిచ్చి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని చెప్పి హామీ ఇచ్చి గద్దెనెక్కి తొమ్మిదేళ్లు గడచినా పేదలకు స్థలాలు, ఇళ్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిదేళ్లు గడచినా ఇప్పటివరకు హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం 'ఆవాస్' యోజన పథకం కింద రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. నాలుగేళ్లుగా అవాస్ యోజన పథకం డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10 లక్షలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా నేతలు మాలోతు రాజేశ్ నాయక్, లావుడ్య రాజేందర్ నాయక్, వెంకటేశ్ నాయక్, తిరుపతినాయక్, సతీశ్, రమేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భీమా సాహెబ్

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

శాయంపేట : రజక సంఘం మండల అధ్యక్షుడు జాలిగపు అశోక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. ప్రభుత్వ సంస్థల్లో దోబీ పనులను రజకులకు కేటాయిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు, స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొత్తపల్లి రవి, కోమ రాజు, ప్రశాంత్, సారయ్య, పున్నం అశోక్, అరవింద్, అఖిల్, సాంబయ్య, సాయి చరణ్, వేణు, తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న రజకులు

కాంగ్రెస్ హయాంలోనే సుపరిపాలన

ఐనవోలు : కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేట చిరంజీవి తెలిపారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆదివారం సాయంత్రం ఖమ్మంలో జరిగిన జన గర్జన సభకు మండల కేంద్రం నుంచి ఉదయం బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సభలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ, రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారని చెప్పారు. సభకు వెళ్లిన వారిలో నాయకులు మహేశ్, బుచ్చిరెడ్డి, సునీల్, రాజు, సలీం, రహీం, తదిరతులున్నారు.



సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఆత్మకూరు : వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ బండారి కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ కుమార్ మాట్లాడారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే జైలుకు పంపిస్తామని చెప్పారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలని, నిబంధనలు పాటించాలన్నారు. తనిఖీల్లో ఎస్సై ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ కుమార్

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్: నేటి (సోమవారం) నుంచి 20 వరకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీజన్ వన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రావణ్‌కుమార్ పటేల్, సంతోష్, తిరుపతి తెలిపారు. ఈ మేరకు కేయూ మైదానంలో టోర్నీ బ్రోచర్లను ఆదివారం ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. కేయూ క్రీడా మైదానంలో కొనసాగనున్న పోటీల్లో పాల్గొనే జట్లు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విజేత జట్టుకు రూ.5వేలు, రన్నరప్ జట్టుకు రూ.2,500ల నగదు పురస్కారంతో పాటు ట్రోఫీలు అందజేయనున్నట్లు తెలిపారు.